🌐 : www.aknu.edu.in
M : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
: 9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 8 | 21-11-2022 | పుటలు : 4

## నన్నయలో ఆదివాసి సమరయోధుల ప్రదర్శన












ఆదివాసి సమరయోధుల చిత్రపటాలను సందర్శిస్తున్న వీసీ











**18.11.22 (మీడియాసెల్)** నేషనల్ కమ్యూనికేషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ (NCST) మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా విద్యాకళాశాల ఆధ్వర్యంలో స్వాతంత్రోద్యమంలో ఆదివాసి సమరయోధుల పాత్ర గురించి ప్రదర్శనను ఏర్పాటు చేసారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో శు క్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఆదివాసి సమరయోధుల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేషనల్ కమ్యూనికేషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ ( NCST) వారు అందించిన అనేక ఆదివాసి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు సందర్శించి గొప్ప స్ఫూర్తిని పొందాలని అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసిల పోరాటం, ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులు, వారి త్యాగాలు అన్ని క్లుప్తంగా ఈ ప్రదర్శన ద్వారా తెలుస్తాయన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు సందర్శకులు ఈ ప్రదర్శనను వీక్షించవచ్చునని ఈ నెల 22వ తేదీ వరకూ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. 22న విశ్వవిద్యాలయంలో 'భారత స్వాతంత్రోద్యమంలో ఆదివాసీల పాత్ర" అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నారన్నారు. ఆదివాసి సమరయోధుల పోరాటాలు, సామాజిక బాధ్యతగా చెపట్టిన కార్యక్రమాలను సమాజంలోనికి తీసుకువెళ్ళాలని, మరిన్ని లోతైన పరిశోధనలు చేయాలని కన్వీనర్ డా. ఆర్. ఎస్. వరహాలదొరకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె. సుబ్బారావు, ఆర్. సాంబశివరావు, డా. ఎం. గోపాలకృష్ణ, డా. జి. ఎలీషాబాబు, డా. వి. రామకృష్ణ, డా. జె. రాజమణి, కె. ఎస్. ఆర్. రాజేశ్వరిదేవి, ఎస్. కృష్ణ, రాజ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.
















## సంపాదకీయం



# నాట్యకళా తరంగం

‘ ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు పెక్కు సూచితి ‘ నంటారు నన్నయగారు రాజరాజ నరేంద్రునితో మహాభారత అవతారికలో. రాజమహేంద్రపురంలో భారతరచనకు ముందే నన్నయ గారు ఎన్నో నాటకాలను చూసినట్లుగా మనకు కనిపిస్తున్న ఆధారమిది. కాబట్టి రాజమహేంద్రిలో తెలుగు నాటక రంగానికి వెయ్యేళ్ల పైబడిన చరిత్ర ఉంది. 14వ శతాబ్దంలో మడికి అనంతయ్య ‘ విష్ణుమాయ ‘ నాటకం రాసి రాజమహేంద్రవర వేణుగోపాల స్వామికి అంకితం ఇస్తున్నట్లు తెలుగు నాటక రంగ చరిత్ర చెబుతోంది.

కందుకూరి వీరేశలింగం గారి ‘ వ్యవహార ధర్మబోధిని ‘ రచన. ఆ నాటక ప్రయోక్త కూడా ఆయనే. దీనిని 1880 ప్రాంతంలో ధార్వాడ నాటక సమాజం ప్రదర్శించింది. ధార్వాడ వారి ప్రభావంతోనే చమత్కార రత్నావళి నాటకాన్ని వీరేశలింగం గారు ఆయన శిష్యులు, కళాశాల విద్యార్థులు ప్రదర్శించారట. తెలుగు నాటకరంగ దినోత్సవం వీరేశలింగం గారి పేరు మీదనే మనం జరుపుకుంటున్నాం కూడా.

కోరాడ రామచంద్రయ్య గారి మంజరీ మధుకరీయం, వావిలాల వాసుదేవశాస్త్రి గారి నందకరాజ్యం, వడ్డాది సుబ్బరాయ కవి గారి వేణీ సంహార జైత్రయాత్ర, చిలకమర్తి వారి గయోపాఖ్యానం, పానుగంటి వారి కంఠాభరణం, చెళ్ళపిళ్ల వారి పాండవోద్యోగవిజయాలు... ఇలా ఈ నాటకాలన్నీ రాజమహేంద్రి ప్రాంతంలో పుట్టి ప్రసిద్ధి చెందాయి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారి బొబ్బిలి యుద్ధం ప్రసిద్ధమైన చారిత్రక నాటకం.

మొదటి తరం నాటకకర్తల్లో ద్రోణం రాజు సీతారామారావుగారు, గున్నేశ్వరావుగారు వీరిరువురు బందరు నాటక సమాజాలకు ఆ రోజుల్లో ముప్పై నాటకాలు పైబడి రచించి ఇచ్చారట. నాటకాల్లో ప్రహసనం ఒక ప్రక్రియ. ప్రహసనం అంటే నవ్వులతో కూడుకున్నదని అర్థం. కందుకూరి, చిలకమర్తి, పానుగంటి వారు చాలా ప్రహసనాలు రాశారు. ప్రహసన ప్రక్రియ హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారి చేతిలో పరాకాష్ఠ పొందిందని చెప్పటం అతిశయోక్తి కాదు. ఇవి మెల్లగా నాటికలుగా రూపాంతరం చెందటానికి కారణమయ్యాయి కూడా.

తెలుగు నాటికల్లో కొత్త ఒరవడిని సృష్టించింది పాకాల రాజమన్నారు గారి “తప్పెవరిది?” నాటిక. ప్రసిద్ధ నటులు బళ్లారి రాఘవగారు బెంగళూరు, మద్రాసు నగరాల్లో ఆ రోజుల్లో థియేటర్లలో ప్రదర్శించారు. ఈనాటిక అప్పటివరకు ఉన్న నాటక రీతుల్ని మార్చింది.

నాటికల వికాసానికి కృషి చేసిన రాజమహేంద్రి ప్రముఖుల్లో పడాల రామారావుగారు, మహీధర రామ్మోహన్ రావుగారు, పోణంగి శ్రీరామఅప్పారావుగారు, ఎన్నార్ నంది, శ్రీ సి.ఎస్.రావు, డాక్టర్ గరికిపాటి రాజారావుగారు వంటి వారి పాత్ర గణనీయమైంది. భమిడిపాటి రాధాకృష్ణ గారి “కీర్తిశేషులు” నాటకమయితే ఆధునిక నాటక రంగాన్ని చాలా ప్రభావితం చేసింది.

రాజమహేంద్రవరాన్ని సాంస్కృతిక రాజధాని అంటున్నప్పుడు వెయ్యేళ్ల నాటక రంగం అందులో ప్రధానమైన అంగం! అంతేకాదు నన్నయ నుంచి నేటి వరకు నర్తిస్తూ పరవశించి ప్రవహిస్తున్న గౌతమీ తరంగం!!

# నన్నయ పర్యావరణం

## (ఏరియల్ వ్యూలో విశ్వవిద్యాలయం)














# భారత ఉక్కు మహిళ

**(నవంబర్ 19, భారత మొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి)**

## ప్రతిభావాణి

భారత ఉక్కు మహిళ ఇందిరా ప్రియదర్శిని గాంధీ. ఈమె మొట్టమొదటి ప్రధాని అయిన జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. 1917 నవంబర్ 19న జన్మించారు. స్వాతంత్ర పోరాట సమయంలో ఒకరి నుండి మరొకరికి వార్తలు చేరవేయటం కష్టంగా ఉండేది. అటువంటి సమయంలో ఇందిర తన స్నేహితులతో కలిసి "వానర సేన "ను ఏర్పాటు చేసింది. తోటి పిల్లలకు స్వాతంత్ర్యం కోసం మనమందరం మన వంతు కృషి చేయాలని చెప్పేది .వానరసేనకు ఇందిర అధ్యక్షత వహించేది. జైలులో ఉన్న నాయకులకు బ్రిటిష్ వారు చేసే అరాచకాలను, అన్యాయాలను ఉత్తరాల ద్వారా తెలియజేసేది. వానరసేన ద్వారా ఒకరి దగ్గర ఉన్న సమాచారాన్ని మరొకరి దగ్గరికి చేరవేసేవారు. లాల్ బహదూర్ శాస్త్రి మరణం తర్వాత ఎవరు అనే ప్రశ్నకు కాంగ్రెస్ సమాధానం కోసం చూస్తున్న తరుణంలో చివరివరసలో కనిపించారు ఇందిర. ఆ ఆడపిల్ల రాజకీయాలలో ఏం చేయగలదులే అని ఆలోచించిన నేతలు కొందరు, గుంగి గుడియా (మూగ బొమ్మ) అని హేళన చేసిన నేతలు కొందరు. రాజకీయాలలో ఆడవాళ్ళ పాత్రను ఆరవ వ్రేలిగా భావించే సమాజానికి, మహిళలకు అధికారం దక్కితే ఏం చేయగలదో ప్రపంచానికి చూపించారు ఇందిరాగాంధీ.

భారత రాజకీయాల్లో ఇందిరా గాంధీ ముందు ఇందిర తరువాత అనే రీతిలో దేశాన్ని అభివృద్ధి చేశారు. ఇందిరమ్మ పేదల పాలిటి పెన్నిధి. గరీబీ హఠావో నినాదంతో దేశంలో 90 శాతం మంది ప్రజలను తన వైపు తిప్పుకున్న ప్రధాని, భారత దేశంలో అత్యధిక ప్రజలను ప్రభావితం చేసిన జన సమూహ శక్తి ఇందిరా గాంధీ.

ఆ రోజుల్లో రాజకీయాలలోకి మహిళలు రావటమే ఇష్టం లేని సమాజంలో ఒక మహిళ రాజకీయ ప్రవేశం చేసి ప్రధానమంత్రి అయి ఇంత పెద్ద దేశాన్ని పరిపాలించడం అంటే ఆ రోజుల్లో సాధారణమైన విషయం కాదు. ఎదురైనా ఎన్నో అవమానాలను అధిగమిస్తూ విమర్శకుల ఎత్తుగడలను చిత్తు చేసింది ఇందిర.రాజకీయ ఎత్తుగడలకు సంచల నిర్ణయాలకు ప్రజాకర్షణ విధానాలకు తిరుగులేని పోరాటాలకు ఇందిర బ్రాండ్ అంబాసిడర్ గా మారింది.



నెహ్రూ ప్రవచించిన సోషలిస్టు విధానాలతో ఇందిర ఎక్కువ రాజీ పడేవారు.బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణాల రద్దు, హరిత విప్లవం ,క్షీర విప్లవంతో గ్రామీణ భారతావని కొత్త పుంతలు త్రొక్కించింది. ఇందిరాగాంధీ అమలు చేసిన పథకాలలో 20 సూత్రాల పథకం అత్యంత ప్రజాధరణ పొందినది .1975లో అమలు చేసిన ఈ పథకం ఇప్పటికీ అమలులో ఉంది. మహిళా సాధికారత, తాగునీటి స్వకల్పన, చిన్నారులందరికీ పౌష్టికాహారం, భూసంస్కరణలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్వావలంబన,అందరికీ ఆరోగ్యం ఎస్ .టి, ఎస్. సి ప్రజలకు న్యాయం, మొదలగు వంటి 20 సూత్రాల పథకం ద్వారా గ్రామాల్లో చాలావరకు పేదరికం తగ్గించింది. గ్రామాల్లో ప్రజల పరిస్థితులు మారాయి. ఈ పథకం ద్వారా దేశ ప్రజల్లో ఇందిరా పరిపాలన పై బలమైన ముద్ర పడింది.

అప్పట్లో బ్యాంకింగ్ సేవలు పారిశ్రామికవేత్తలకు మరియు ఉన్నత వర్గాల వారికే పరిమితం బ్యాంకింగ్ వ్యవస్థ అంతా కొందరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే నడిచేది గ్రామాలలో రైతులకు పేద ప్రజలకు వడ్డీ వ్యాపారస్తులే దిక్కు దీనితో ఈ పరిస్థితి మార్చాలని ఉద్దేశంతో 1969 జూలై 19న దేశంలో 14 ప్రధాన బ్యాంకులను జాతీయకరణ చేశారు. దీనితో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలు కూడా విస్తరించాయి. జాతీయ బ్యాంకులన్నిటికి అనుబంధంగా గ్రామీణ బ్యాంకులను నెలకొల్పి మారుమూల ప్రాంతాలలోని గ్రామీణులు ,రైతులు, వ్యవసాయదారులకు సేవలను అందుబాటులో కి తీసుకొచ్చాయి. వ్యాపారం చేయాలనుకునే మధ్యతరగతి వర్గాల వారికి రుణాలు లభించాయి .దీనితో రైతులకు వడ్డీ వ్యాపారుల బాధా తప్పింది .ఒకే ఒక్క నిర్ణయంతో దేశ ఆర్థిక పురోగతి బాటలు వేయడంతో పాటు గ్రామీణ భారతావనిలో క్రొత్త విప్లవం సృష్టించింది.

స్వాతంత్రం వచ్చిన తర్వాత వందల సంస్థానాలు దేశంలో విలీలనమయ్యాయి. అప్పటివరకు రాచరికంలో ఉన్న సంస్థానాధీశులు దర్పాన్ని కొనసాగించేందుకు భారత ప్రభుత్వంతో రాయబారాలు నడిపి భరణాన్ని సంపాదించుకున్నారు. వందల మంది సంస్థానాలకు సంవత్సరానికి కోటి రూపాయలు చొప్పున ఇవ్వడం జరిగేది ఈ డబ్బుతో సంస్థానాధిపతులు ఏ కార్యకలాపాలు నిర్వహించేవారు కాదు .దీనికి స్వస్తి పలికారు ఇందిర. రాజా భరణలను రద్దుచేసి ఆమెలో నిజమైన సోషలిస్టు ఉన్నారని ప్రపంచానికి చాటి చెప్పారు ఇందిర.

ఆమె ప్రవేశపెట్టిన పథకాల ద్వారా మరియు ప్రజలపై ఉన్న ప్రేమాభిమానాలు ఇందిరాగాంధీ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అంతర్జాతీయంగా భారత్ ను బలమైన దేశంగా నిలపడంలో ఇందిర ప్రత్యేకమైన వ్యూహాన్ని అమలు చేశారు. ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత పరిపూర్ణ రాజనీతి తత్వవేత్తగా వ్యవహరించారు.నేటి మహిళలకు ఇందిర ధైర్యసహసాలే ఆదర్శం.

– ఏ.జె.ఎస్.దీప్తి,పూర్వ విద్యార్థి.
ఎం.ఏ పొలిటికల్ సైన్స్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

---

## మంచి మాట




**ఓ భగవంతుడా! "వ్యక్తి కన్నా దేశం గొప్పది" అనే ఆలోచనను నాయకులు, అధికారులు, ప్రజల మనసుల్లో ప్రతిష్ఠించు. ఈ దేశాన్ని శాంతి, సంపదలతో వర్ధిల్లే జాతిగా మార్చేందుకు పట్టుదలతో కృషి చేసేలా నా ప్రజలను ఆశీర్వదించు.**

– ఏ.పి.జె.అబ్దుల్ కలాం.

---

# అయిన్ ర్యాండ్ - ది ఫౌంటెన్ హెడ్

## పుస్తకం




అయిన్ ర్యాండ్.ఆనందోబ్రహ్మ (ఆబ్జెక్టివిజం),వ్యక్తిత్వవాదం (ఇండివిడ్యువాలిటీ) అనే అంశం తెలిసిన ప్రతి ఒక్కరికి అయిన్ ర్యాండ్ ఆనందోబ్రహ్మ తెలియకుండా ఉండదు. 20వ శతాబ్ది ఆంగ్ల సాహిత్యంలో పేరెన్నికగన్న తత్వశాస్త్రవేత్తల్లో ఆమె ఒకరు.ఆమె ఒక విలక్షణ రచయిత్రి.తన రచనల ద్వారా ఎందరో గొప్పవారి నుండి సామాన్యుని వరకు అందరినీ ప్రభావితం చేసిన మహిళ. అస్తవ్యస్తంగా మారిన ఈ సమాజంలో ముసుగేసుకున్న మానవత్వాన్ని అర్ధనగ్నంగా నడిరోడ్డు మీద నిలబెట్టిన ఏకైక తత్వశాస్త్రం వ్యక్తిత్వ వాదం దీనినే సాధారణంగా ఆనందోబ్రహ్మ అంటారు. ఈ తత్వశాస్త్రాన్ని ఈమె ప్రపంచానికి పరిచయం చేశారు. 1905 లో ఫిబ్రవరి 2న రష్యాలో సెయింట్ పీటర్స్ బర్గ్ లో జన్మించారు. ఆమెది సాధారణ మధ్యతరగతి కుటుంబం. ఆమె పూర్తి పేరు అలీసా జినోవినా రొసెన్ బామ్. చిన్నప్పటి నుండీ సాహిత్యం అంటే విపరీతమైన ఇష్టం. హై స్కూల్ చదువుకునే సమయానికే విక్టర్ హ్యూగో ఆమె అభిమాన రచయిత. 1924లో పెట్రగాడ్ విశ్వవిద్యాలయంలో చరిత్ర, తత్వశాస్త్రం అధ్యయనం ద్వారా ఆమె పట్టభద్రురాలు అయింది.స్క్రీన్ ప్లే రైటింగ్, చలనచిత్ర కళను అధ్యయనం చేయటానికి స్టేట్ ఇనిస్టిట్యూట్ లో చేరారు. 1925లో అమెరికాలో బంధువులను చూడటానికి విజిటింగ్ వీసాను పొందారు. అక్కడ ఉన్న అత్యున్నత అవకాశాలను చూశాక అక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకుని హాలీవుడ్ చిత్రాలకు స్క్రీన్ ప్లే రైటర్ గా మారారు. 1927లో ది కింగ్ ఆఫ్ కింగ్స్ అనే సినిమాకి పని చేస్తూ ఆ సినిమాలో నటిస్తున్న ఫ్రాంక్ ఒ కార్నర్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 1931లో అమెరికా పౌరసత్వం పొందారు. ద ఫౌంటైన్ హెడ్ అనే పుస్తకాన్ని 1936లో ప్రారంభించారు. 1943లో ఈ పుస్తకం ప్రచురించబడింది.ఈ పుస్తకాన్ని చదివేటప్పుడు ప్రపంచాన్ని రచయిత్రి కళ్ళతో చదివి, ఆలోచించినప్పుడు మాత్రమే మనకి పూర్తిగా అర్థం అవుతుంది. ఈ పుస్తకం ద్వారా అన్వయాత్మక తత్వం బోధపడుతుంది.అలా ఆలోచింపచేస్తారు మనల్ని రచయిత్రి.ఆంగ్లంలో ఉన్న ఈ నవలని డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వర రావు గారు తెలుగులోనికి అనువాదం చేశారు. 2019లో గోదావరి ప్రచురణల వారు ప్రచురించారు.

తన ఫిలాసఫీ నిజ జీవితంలో ఒక వ్యక్తి పాటిస్తే అతనికి ఎదురయ్యే దెబ్బలు, అవమానాలను అతను ఎలా ఎదుర్కోవాలో అలా ఎదుర్కోవటానికి ఎలాంటి మైండ్ సెట్ ని ఏర్పరుచుకోవాలో ఈ పుస్తకంలో తను నమ్మిన ఐడియల్ మ్యాన్ హొవార్డ్ రోర్క్ ద్వారా ప్రపంచానికి చెప్తారు ర్యాన్డ్. సరికొత్త తాత్వికతని ఈ పుస్తకం ద్వారా ఆమె పరిచయం చేశారు. తన తత్వాన్ని సజీవంగా రూపు కట్టించడానికి ఎన్నో జీవితాలను, ప్రత్యేక ప్రపంచాలను సృష్టించి ది ఫౌంటెన్ హెడ్, అట్లాస్ ష్రగ్గెడ్ నవలను విడుదల చేశారు.

ఆనందో బ్రహ్మ అంటే "నీకోసం నువ్వు బ్రతకటం. నీ సంతోషం కోసం బ్రతకడం. ఇంకొకర్ని నీకోసం బ్రతకమని అడక్కు" చాలా కాంప్లెక్స్ తో కూడుకున్న నిజం ఇది. ఇప్పటి వరకు ఉన్న అన్ని సిద్ధాంతాలు ఎలా బ్రతకాలో మాత్రమే చెబుతాయి. అవన్నీ నిజం మీద కాకుండా భావోద్వేగాల మీద ఆధారపడి ఉంటాయి." నీ జీవితం నీ స్వార్థ ప్రయోజనాల కొరకు ఆడుతున్న ఒక ఆట" అంటారు ర్యాండ్.భర్త 1979లో చనిపోగా ఆమె 1982లో న్యూయార్క్ నగరంలో తుది శ్వాస విడిచారు. ర్యాండ్ ప్రతిపాదించిన ఈ ఫిలాసఫీ వచ్చి 80 సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటికీ ఈ పుస్తకం ప్రసిద్ధి చెందటానికి ఇప్పుడు తెలుగులో రావటానికి ఆమె వ్యక్తపరచిన అద్భుతమైన ఆలోచనా విధానం వ్యక్తివాదం. ఇది తెలుసుకోవడానికి ఆమె పుస్తకాల్ని తప్పనిసరిగా చదివి తీరాల్సిందే.

- యం.సాహితి,
ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

# నాక్ సన్నద్ధతలో విశ్వవిద్యాలయం

## విభాగాలను పరిశీలించిన ఉపకులపతి







పరీక్షా విభాగంలో...



బొటానికల్ గార్డెన్....



క్రీడా క్షేత్రంలో....



విద్యా కళాశాలలో



ఇంజనీరింగ్ కళాశాలలో.....



కేంద్ర గ్రంథాలయంలో....



నన్నయభారతిలో తాళపత్రాలు, తామ్ర శాసనాలు,అరుదైన గ్రంథాల పరిశీలన







విశ్వవిద్యాలయంలో శాస్త్ర ప్రయోగ శాలలు









ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in